పల్లవి, భర్త రామకృష్ణ కోసం పొద్దున్నించీ – అంటే అతను డ్యూటీకి వెళ్ళినప్పటి నుండీ – ఎదురుచూస్తూనే వుంది. రెండు నెలల క్రితమే పెళ్ళయి – భర్తతో ఒంటరిగా కాపురానికి వచ్చిన అమ్మాయి అలా ఎదురుచూడటంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఆమె ఎదురు చూసేది అతని కోసం కాదు – అతను తీసికెళ్ళిన తన పెన్నుకోసం!

కొత్తగా పెళ్ళయిన అమ్మాయే అయినా, ఆమెకి ఏకాంతంలో భర్త గుర్తు రాడు – భర్తేకాదు ఎవరూ గుర్తుండరు! తన ఆలోచనలే ఊపిరిపోసుకుని తనతో కబుర్లాడటం మొదలుపెడతాయి. వాటిని అక్షరాలుగా మార్చి పేపర్ మీద పెడుతుంటే భర్తకాదు కదా ఈ లోకమే గుర్తుండదు. ఆమె రచయిత్రి!

మళ్ళీ ఓసారి బయటక్కి వచ్చింది. రోడ్డు చివరివరకూ చూసింది. ఎండా కాలం మిట్ట మధ్యాహ్నం కావడంతో, సూర్యుడు నడినెత్తిమీద వున్నాడు. అందుకే బయట జనం అలికిడి లేదు. అసలే అవి కొత్తగా కట్టిన పోలీస్ క్వార్టర్స్, ఇంకా మొత్తం నిండలేదు కూడా. పల్లవి వాళ్ళింటికి ఇవతల ఖాళీగానే వున్నాయి క్వార్టర్స్.

# ముగింపు మారదు

వష్ణమూడి ముగ్గాంబ

రాత్రంతా ఆలోచించుకుని అక్షరాలుగా – పదాలుగా – వాక్యాలుగా – పేరాలుగా – పేజీలుగా మెదడునిండా నింపుకున్న కథ! తెల్లారి గబగబా పనికానిచ్చుకుని – భర్తని బయటకి పంపి తెల్లకాగితాలు తీసుకుని – పెన్నుకోసం చూస్తే కనిపించలేదు.

రెండునెలల సహచర్యంతోనే భర్తకి ఎక్కడంటే అక్కడ పెన్నులు పోగొట్టే అలవాటుందని గ్రహించింది. ఈ తక్కువ వ్యవధిలోనే అయిదారు పెన్నులు పోగొట్టాడు. మర్చిపోకుండా ఇంట్లోంచి తీసికెళ్ళే అలవాటుందిగానీ – తీసుకొచ్చే జ్ఞాపకశక్తి మాత్రం లేదు. అందుకే తను జాగ్రత్తగా ఓపెన్ చేసి పక్కన పెట్టుకుంది – కేవలం తను కథలు రాసుకునేందుకు. ఈ రోజు దానికి కూడా కాళ్ళొచ్చాయని అర్థమైంది ఆమెకు. తను పనిలో వుండగా అతనాపెన్ తీసికెళ్ళిపోయాడు.

ఈ కొత్త ఏరియాలో ఎవర్నడిగి తీసుకోవాలి. పోనీ బజార్ దాకా వెళ్ళి తెచ్చుకుందామన్నా చాలా దూరం.

రాయటం లేట్ అయ్యేకొద్దీ అమూల్యమైన తన ఆలోచనలు ఎక్కడ



ఆమెకింకా అక్కడ ఎవరితోనూ సరిగ్గా పరిచయం కాలేదు. 'సబ్ఇన్స్పెక్టర్ భార్య'గా హోదా మెయిన్‌టెయిన్ చెయ్యాలనీ– రిజర్వుడుగా వుండాలనీ – ఏమీలేదుగానీ ఆమెకి స్నేహాలు పెంచుకునే టైమ్ తక్కువ! పుస్తకాలు అనే స్నేహితులు ఇంట్లోనే ఆమెని కట్టిపడవేయడం అందుకు కారణం.

ఇంట్లోకొచ్చి టైమ్ చూసింది. రెండున్నర అయింది. భోజనానికి కూడా లేట్ అయిపోతోందే! – తను కూడా భోం చేయలేదు. అయినా తినబుద్ధికావడం లేదు. ఎలా తినగలదు–మనసు, కడుపు అంతా నిండుగా వున్నట్టుంది. ఆ బరువు దించేసుకోవాలంటే పెన్నుకావాలి!

చె దిరిపోతాయోనని భయంగా వుంది ఆమెకి. వీధిచివర బడ్డీకొట్లో చాక్లెట్లు కొనుక్కుని ఎక్కడ కాకెత్తుకుపోతుందోనని భద్రంగా గౌనుచాటున దాచుకుని తెచ్చుకొనే మూడేళ్ళపాపలా - ఆమె ఎంతో అపురూపంగా తన మెదడులో పదిలపరుచుకున్న ఆలోచనలు ఎక్కడ జారిపోతాయో అన్నట్టుగా - మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంటోంది.

అసలు ఆమెకి ఆ కథకి ప్లాట్ ఇచ్చింది భర్తే!

రామకృష్ణ జీవితంలోకి పల్లవి, ఉద్యోగం ఒకేసారి ప్రవేశించడం జరిగింది.

కొత్త భార్య, కొత్త ఉద్యోగం - సగటు మనిషికి రెండూ దాదాపు ఒకే ఆనందాన్నిస్తాయి! నిజంగా చెప్పాలంటే రెండోదే ఎక్కువ ఆనందం ఇవ్వవచ్చు కూడా! అంతేకదామరి - అతని దృష్టిలో - మొదటిది తను జీవితాంతం భరించవలసిన దైతే, రెండవది తనను జీవితాంతం భరించేది.

అయితే రామకృష్ణలో సగటుమనిషి లక్షణాలు ఎక్కువలేవు. అయినా అతనికి తన ఉద్యోగమంటే అమితమైన ప్రేమ. అందుకు కారణం వుంది.

అతని చిన్నతనం ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా గడిచింది. అలాగని వాళ్ళు పెద్ద ఆస్తి పరులూకాదు, తండ్రి లంచాల ద్వారా అక్రమార్జన చేయనూలేదు. అతని తండ్రి మిలటరీలో పనిచేశాడు. తండ్రి దేశం కోసం ఎంత దీక్షగా పనిచేశాడో - తల్లి అతన్ని అంత జాగ్రత్తగా పెంచింది.

తన తండ్రి మొదట కర్తవ్యాన్ని ప్రేమించి - తరువాతే తనవాళ్ళని ప్రేమించడం రామకృష్ణకి తెలుసు. అటువంటి వ్యక్తికి కొడుకుగా పుట్టిన అతను ఉద్యోగాన్ని అంతగా ప్రేమించడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

అటువంటి రామకృష్ణ క్రితం రాత్రి పదకొండింటికి చాలా చికాగ్గా ఇంటికి వచ్చాడు. పల్లవి భోజనం వడ్డించి "అలా వున్నారేం!" అంది. అతను మాట్లాడకుండా భోంచేశాడు. ఆ సమయంలో నోరువిప్పితే ఆ మొహంలోని చిరాకు కొంచెమైనా మాటల్లోకి ఒలకకపోదు. అందుకేనేమో అన్నట్టుగా అతను చాలా సేపు మౌనంగా వుండిపోయాడు.



పల్లవి. వంటిల్లు సర్దుకుని పడుకున్నాక తనే చెప్పడం మొదలుపెట్టాడు.

"నీకిదివరకోసారి చెప్పాను పల్లవీ – గుర్తుందా – కామేశ్వర్, అని – ఓ పెద్ద పారిశ్రామిక వేత్త కుమారుడు – మా డి.ఎస్.పి. గార్కి దగ్గర బంధువూను – అతను పొద్దున్న కాలేజీ ఆవరణలో బహిరంగంగా ఓ లెక్చరర్‌ని కొట్టాడు. నేను అరెస్టు చేశాను. ఎంత నిర్లక్ష్యం అనుకున్నావ్ వాడి మొహంలో – తలచుకుంటే రక్తం మరిగిపోతుంది. సాయంత్రంకల్లా వాణ్ని విడుదల చేయమని పైనుంచి ఆర్డర్స్ – ఆ లెక్చరర్ కూడా తన రిపోర్టు ఉపసంహరించుకున్నాడు. ఇటువంటి సంఘటనలు ఈ రెండు నెలల్లోనే రెండుసార్లు జరిగాయి. ఇది మూడోసారి.

అయినా వాణ్ణి పూర్తిగా ఒక్కరోజు కూడా జైల్లో వుంచలేకపోయాను. ఇక నేను ఈ ఖాకీబట్టలు ఎందుకు వేసుకోవాలో – ఎందుకు జీతం తీసుకోవాలో అర్థం కావడం లేదు"

అతను పైకి చాలా నిదానంగా మాట్లాడుతున్నా చాలా ఫ్రస్టేషన్‌లో వున్నాడని అర్థమైంది పల్లవికి. అయినా ఆమేం మాట్లాడలేదు. కనీసం అనునయంగా ఓదార్చలేదు.

పిరికివారు, తెలివితక్కువ వారు అయిన వారిని ఫ్రస్ట్రేషన్‌లో ఒంటరిగా వదిలేయకూడదు. అది ఏ మానసిక వ్యాధులకో – ఆత్మహత్య నిర్ణయాలకో దారితీస్తుంది. ఎందుకంటే వారి ఆ మానసిక స్థితిని కారణమూ, పిరికితనమూ – తెలివి తక్కువ తనమూ అయివుంటుంది కాబట్టి.

కానీ తెలివయిన వారూ, ధైర్యవంతులూ కేవలం పరిస్థితుల ప్రాబల్యం వల్ల అటువంటి స్థితికి గురవుతారు. అటువంటి వారికి ఎవరి ఓదార్పూ అక్కర్లేదు. వాళ్ళు తమ ఏకాంతంలోంచి – మానసిక సంఘర్షణలోంచి – తప్పకుండా పరిష్కారాన్ని కనుక్కోగలుగుతారు. అది సాధ్యం కాకపోయినా చివరి వరకూ పోరాడే ధైర్యాన్ని, ధ్యేయాన్ని కలిగివుంటారు. అంతేకానీ తమకు తాము కాని – ఇతరులకు గాని హాని కలిగించాలనుకోరు.

అందుకే పల్లవి అతని ఆలోచనల్లో అతన్ని వదిలేసి తన ఆలోచనల్లోకి జారిపోయింది. ఆమె అతన్ని అనునయించక పోవడానికి మరో కారణం కూడా వుంది. అతను చెప్పింది విన్నాక ఆమెలోని భార్యకంటే రచయిత్రి ఎక్కువగా స్పందించింది. ఆ స్పందనకు ఆలోచనా రూపం ఇచ్చేపనిలో పడిపోయింది. తెల్లారేసరికి తన ఆలోచనలకో నిర్దిష్టరూపాన్ని ఇవ్వగలిగింది. ఆ రూపాన్ని పేపర్‌మీద పెట్టడానికి పెన్ను లేకపోయింది.

పంచభక్ష్యపరమాన్నాలు ఎదురుగా పెట్టి – కాళ్ళూ, చేతులూ, నోరూ కట్టేసినట్టుంది ఆమె పరిస్థితి.

మూడవుతుండగా వచ్చాడు రామకృష్ణ ఇంటికి. అతను రాగానే ఆమె అడిగిన ప్రశ్న "నా పెన్ను తీసుకెళ్ళారు తెచ్చారా" తెచ్చివుండరు అన్న భావాన్ని పలికిస్తూనే' అంది.

"తేలేదు స్టేషన్‌లో వుందిలే! మూడింటికి భోజనానికి వస్తే అన్నంపెట్టకుండా అడ్డమైన ప్రశ్నలూ వేస్తావేంటీ" అతనూ చిరాగ్గానే అన్నాడు.

"తెచ్చుండరు నాకు తెలీదా! రాత్రినుంచీ ఆలోచించి పొద్దున్నే కథ రాసుకుందామంటే ఇంట్లో పెన్నులేదు. అయినా ఇదేం అలవాటండీ బాబూ – మీకూ, ఇంట్లో వున్న పెన్నులు తీసుకెళ్ళి బయట పారేసి వస్తారు."

అతనికి చిర్రెత్తింది. "మహారాశావులే! ఏదో గొప్ప రచయిత్రి అయినట్టు – ముందు అన్నంపెట్టు" ఆమె ఢన్‌మని శబ్దం చేస్తూ టేబుల్‌మీద పళ్ళెంపెట్టి అన్నం వడ్డించింది. మూతిముడిచేసింది. అతను పట్టించుకునే స్థితిలో లేడు.

భోంచేసి బయట వరండాలో కూర్చున్నాడు రామకృష్ణ. పల్లవి లోపల వంటిల్లు సర్దుకుంటుంటే తమ ఇంటిముందు స్కూటర్ ఆగిన శబ్దం వినిపించింది. లోపల పని ఆపి బయటకి వచ్చింది. ఎవరో ఇద్దరు కుర్రాళ్ళు స్కూటర్‌స్టాండ్ వేసి లోపలికి వస్తున్నారు. వాళ్ళ వాలకంలో ఏదో అసహజత్వం తోచింది ఆమెకి.

రామకృష్ణ లేచి బయటికి వచ్చాడు. ఆమె వరండా గ్రిల్స్‌లోంచి బయటకి చూస్తోంది.

ఆ కుర్రాళ్ళలో ఒకడు విసురుగా ముందుకువచ్చి – "ఏంది ఇన్స్‌పెక్టర్!సిన్మా హీరోననుకుంటున్నవా – గిది మూడోసారి! మల్ల నాజోలికొచ్చినవంటే మంచిగుండదు. గిదే లాస్ట్ వార్నింగ్ నీకు – సమజయినదా!" వచ్చినంత వేగంగానూ స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయారు వాళ్ళు.

పల్లవి వెంటనే తేరుకోలేకపోయింది గానీ – రామకృష్ణ ఏం తెల్లబోలేదు. అలర్ట్‌గానే వున్నాడు. కానీ అతను సమాధానం చెప్పేంతలోనే వాళ్ళు వెళ్ళిపోయారు. రాత్రి చెప్పిన ఇన్సిడెంట తాలూకు వ్యక్తి అతనేనని అర్థమైంది పల్లవికి. రామకృష్ణ లోపలికి వచ్చి కుర్చీలో మెడ వెనక్కువాల్చి కూర్చున్నాడు. అతడి మొహంలో భావాలు ఆమెకి అర్థం కావడం లేదు.

గ్రిల్స్‌లోంచి స్కూటర్‌మీద వెళ్ళిపోతున్న వాళ్ళను చూస్తుంటే ఆమెకి – తాము జైల్లో వున్నట్టూ, వాళ్ళు బయట స్వేచ్ఛగా తిరుగుతున్నట్టూ అనిపించింది. మంచిని చెడే అరెస్టు చేస్తున్న రోజులివి. అందుకే "దేశంలో తెలివైన వాళ్ళంతా జైళ్ళలో మగ్గుతున్నారు" అన్నాడో ప్రముఖ రచయిత ఒక రచనలో.

నిజమే – ఈ సమాజంలో మంచి వాళ్ళంతా కూడా జైళ్ళలోనే మగ్గుతున్నారు. జైళ్ళంటే కటకటాల వెనుక గదులు మాత్రమే కాదు. ఏంచేయాలో తెలిసి – ఎలా చేయాలో తెలిసి – అలా చేయలేకపోవడం తమ వ్యక్తిత్వాన్ని చంపుకోవడమే అని తెలిసీ – ఏమీ చేయలేక నిస్సహాయంగా చూస్తుండిపోవడం ఎంత భయంకరమైన పరిస్థితి! అంతకంటే ఘోరమైన

## మాజిక్ నోటు

ఓసారి స్వర్గీయ రమణారెడ్డి జాతీయ రక్షణ నిధి కోసం ఓ చోట మాజిక్ ప్రోగ్రామ్ ఇచ్చి, మర్నాడు షూటింగ్ వుండడం మూలంగా ఆ రాత్రికి రాత్రే మద్రాసుకు బయలుదేరాడు. దారి లోకొందరురౌడీలు కాసి, కారుఆపేసి, మూటా ముల్లే బయటకు తియ్యమన్నారు. నిజానికి ఆ సమయాన రమణారెడ్డి జేబులో వంద రూపాయిల నోట్లు పది వున్నాయి. వేసుకున్నది టెర్లిన్ షర్ట్ కావడం వల్ల రౌడీగాళ్ళ కళ్ళు రమణారెడ్డి జేబులోని నోట్లమీదే సరిగ్గా పడ్డాయి.

వెంటనే అదిగమనించిన రమణారెడ్డి చిరునవ్వుతో "కావాలంటే తీసుకోండోయ్ ఈ వెయ్యి రూపాయలూ!" అని చాలా ఠీవితో వాటినితీసి, ఆ రౌడీగాళ్ళకు ఇచ్చాడు.

దాంతో వాళ్ళు ఒకరి ముఖాలొకరుచూసుకోసాగారు. వెంటనే రమణారెడ్డి "ఎందుకోయ్, అలా కంగారుపడతారు? ఈ వంద రూపాయిల నోట్లు పోతేపోయాయి. ఇలాంటివే మరికొన్ని నోట్లు వేరే అచ్చు వేయించుకుంటాను. ఫరవాలేదు. వాటిని మీరే వుంచుకోండి" అన్నాడు.

ఆ రౌడీలు "మేమేదో సీక్రెట్‌గా వ్యాపారం చేసుకుంటూ వుంటే, మమ్మల్ని పట్టి పబ్లిక్‌లోకి లాగేటట్లున్నావ్?" అని హాస్యమాడారు.

"మరిలేకపోతే మాజిక్‌షోలో కూడా నిజమైన వంద రూపాయిలు తగలబెడతానా ఏం?" అని కసురుకున్నాడు రమణారెడ్డి.

"చాలు చాలు వెళ్ళవయ్యా.. సన్యాసీ సన్యాసీ రాసుకుంటే బూడిదరాలిందట"అని ఆ నోట్లను రమణారెడ్డి కారులోపారేసి,ఆ రౌడీలు వచ్చిన దారినే చక్కాపోయారు. – పి.ఆర్. బద్దిగం

జైలు వుంటుందా!

తన బిడ్డ గుక్కపట్టి ఏడుస్తుంటే పరిగెత్తుకుంటూ వచ్చి పాలివ్వకుండా ఉండలేని తల్లి – చిన్నారి కొడుకు కిందపడితే ఆత్రుతగా వచ్చి లేపకుండా వుండలేని తండ్రి – అలాంటి వాడే – తన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చకుండా వుండలేని నిజాయితీ గల ఉద్యోగి, మానవత్వం గల మనిషి.

మొదటి రెండు సందర్భాలలో తల్లిదండ్రులకి తమ బిడ్డ ఎంత ప్రీతికరమైనదో రామకృష్ణకి తన కర్తవ్యం అలాంటిదే! సహజంగానే తనున్న పరిస్థితికి అతని మనసు విలవిలలాడింది.

భర్త అన్ని చికాకుల్లో వుంటే తను పెన్నుగురించి విసిగించిందే అని పల్లకి కూడా పశ్చాత్తాప పడింది. మరో అరగంటకి రామకృష్ణ మొహం కొంచెం తేటపడింది. "ఏం కథ రాద్దామనుకున్నావ్ పల్లవీ" ప్రశాంతంగా అడిగాడు. ఆమె ఆశ్చర్యపోతూనే రాత్రి తను అనుకున్న సబ్జెక్ట్ మొత్తం వివరంగా చెప్పింది. కొత్తదేం కాదు అతనున్న పరిస్థితే!

"మరి ముగింపు ఎలా ఇవ్వాలనుకుంటున్నావ్"

ఆమె వెంటనే సమాధానం చెప్పలేకపోయింది. గంటక్రితం దాకా ఎన్ని ఆటంకాలు ఎదురైనా నిజాయితీ వదలని ఓ పోలీసాఫీసర్ కథే రాద్దామనుకుంది. ఇప్పుడూ ఆ అభిప్రాయం మార్చుకోవడం ఆమెకి ఇష్టంలేదు. కానీ ఆమెలో వున్న ఓ సగటుస్త్రీ, భార్య – ముగింపు మార్చమని మెల్లగా గొణుగుతోంది. ఇక ఆ రౌడీమూక గురించి పట్టించుకోకుండా అతను తన బతుకేదో తను హాయిగా గడిపేసేలా రాయమంటోంది

ఆమె సందిగ్ధం అతనికర్థమైంది. ఆమె ఆ కథకి ఇవ్వబోయే ముగింపే తనకి ఇవ్వబోతున్న సలహా అనికూడా అర్థమైంది. చిన్నగా నవ్వాడు. "చూడూ! రాత్రంతా కష్టపడి ఆలోచించి కథ తయారు చేసుకున్నావ్, పొద్దునే పెన్ను దొరకలేదని చాలా బాధపడ్డావ్! కంగారు పడ్డావ్! నన్ను కోప్పడ్డావ్ కూడా! సరే – అక్కడితో నీ మనస్సులోంచి – మెదడులోంచి ఆ కథ పుర్తిగా తుడిచిపెట్టుకుపోయిందా! ఇప్పుడు పెన్నుదొరికితే మళ్ళీ కథ రాయవా!"

అతడెందుకలా అడుగుతున్నాడో అర్థంకాక ఆశ్చర్యపోతూ "భలేవారే! పెన్నులేనంత మాత్రాన కథని వదిలేస్తానా – సంవత్సరం తర్వాతైనా ఆ థీమ్‌ని అలాగే గుర్తుంచుకుని రాస్తాను" ఆమె తన జ్ఞాపకశక్తిని గురించి కొంచెం గర్వపడుతూ చెప్పింది. ఆమె చెబుతుంటే అతను నవ్వుతూ విన్నాడు.

"చూశావా పల్లవీ! రాసే సాధనం లేనంతమాత్రాన రాయాల్సింది. మనసులోంచి మాయంకాలేదు. అలాగే – నిరూపించే అవకాశం, మార్గం లేనంతమాత్రాన నిజాయితీ అంతమైపోదు. ఆఫ్ట్రాల్ రాత్రి ఆలోచించుకున్న కథని సంవత్సరం తర్వాతైనా బయటకు తీస్తాను అంటున్నావ్! మరి నేను పుట్టినప్పటి నుంచీ నా నరనరాల్లో జీర్ణించుకుపోయి – నా శరీరంలో ఒక అవయవంలా కలిసిపోయిన నా వ్యక్తిత్వం ఈ చిన్న ఆటంకాలకు భయపడి నన్ను విడి చిపెట్టేస్తుందా" ఓ క్షణం ఆగాడు.

"నువ్వు ముగింపు మార్చాలనుకున్నావ్ గానీ మార్చలేవు పల్లవీ– ఇలాంటి కథలకి ముగింపు మారదు. అసలు అవి కథలుకావు – సత్యాలు. సూర్యుడు తూర్పున ఉదయించి పడమర అస్తమించడం లాంటివి ఎలాంటి సత్యాలో – ఒక బాధ్యతాయుతుడైన, నిజాయితీ పరుడైన మనిషి వ్యక్తిత్వం కూడా అలాంటి సత్యమే. దానికి మార్పులు చేర్పులు వుండవు– పెన్ నేవచ్చేటపుడు తేనా, ఎవరితోనన్నా వెంటనే పంపనా!" కుర్చీలోంచి లేస్తూ అన్నాడతను.

"పర్లేదు మీరొచ్చేప్పుడు తెండి – కథ ఎక్కడికీ పోదుగా" తేలిగ్గా నవ్వేస్తూ అందామే.

◆

## దూరంగా తొలగిపో

నీ కళ్ళల్లోకి తొంగిమూసే సాహసం లేదు
నా అధికారం అగాధంలోకి జారి పోతుందన్న భయం
నిరీక్షణంలో సమీక్షణంలో నా కోసం కన్నీళ్ళు పెట్టే
నీ రెండు దుఃఖ కలశాలు గుర్తొస్తే
ఆరాటాన్ని, బాధల్ని, నిరాశల్ని నువ్వే నిక్షిప్తం చేసుకో
అగ్ని పర్వతాన్నై ఎక్కడ బద్దలౌతానోనన్న భీతి.

నన్ను భర్తను చేసి కొరడా నా చేతికిచ్చిన
వ్యవస్థ పెంపుడు మృగాన్ని నేను
నిన్ను మభ్యపెట్టడానికి ఒకింత మాయ
కళ్ళు కప్పడానికి కాసిన్ని మాటలు
నొక్కిపట్టడానికింత కండబలం అండగా
అనంత కాలాన్ని అలవోకగా దాటి వచ్చినవాణ్ణే
మోపెడు సహనాన్ని నీ తలమీది కెత్తి
మోజులు తీర్చుకుంటున్న వాణ్ణే
నిన్ను పొగడ్డం నాకు వెన్నతో బెట్టిన విద్య.

సర్దుకుపోతూ సమాధాన పర్చుకుంటూ
నువ్వు కొరత పెట్టుకుంటున్న
కోరికల మీద అంతిమ విజయం సాధిస్తున్న వాణ్ణే
ఇంత చవగ్గా నిన్ను తప్ప దేన్నీ పొందలేని వాణ్ణే
నీ కంటే చులకనైంది ఏదీ లేని వాణ్ణే
పెరికేస్తున్న కొద్దీ
పెనువేసుకుపోతున్న పిచ్చి తీగా!
నా నుంచి, నా విజయాల్నుంచి
నా అహాల నుంచి, అధికారం నుంచి
దూరంగా తొలగిపో...
నా శూన్యాన్ని అంచనా కట్టుకోవాలి
నా హైన్యాన్ని తీవ్రంగా అసహ్యించుకోవాలి
దయుంచి కోపంగా దాటిపో...
నాకు దొరక్కుండా...
అప్పటికైనా నన్ను వెతుక్కోనీ
లోతైన నీ చూపుల్ని
నా కోసం సుళ్ళు తిరిగే అలల్ని
పోగొట్టుకున్న నా మానవాంశనీ
నిండు నది లాంటి నిన్నూ నీ గుండెనూ–

– వరుఖల శివకుమార్